రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సెహరీ (శుక్రవారం ఉదయం)
రాయచోటి	6.31	4.55
మదనపల్లె	6.33	5.00
రాజంపేట	6.29	5.03
పీలేరు	6.31	4.53

మామిడి పూత... తెగుళ్ల కాత

- తెల్లవారుజామున మంచు
- మధ్యాహ్నం మండుతున్న ఎండలు
- తెగుళ్లతో మాడిపోతున్న పూత
- సస్యరక్షణ చర్యలు చేపట్టినా నిలబడని పిందెలు
- 20 వేల ఎకరాల్లో భారీ ఎత్తున నష్టపోతున్న రైతులు

రాజంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు మంచు, మరోవైపు మండుతున్న ఎండలు, విభిన్న వాతావరణంలో వివిధ రకాల తెగుళ్లబారిన మామిడి పూత మాడిపోతోంది. మొదటగా పూతరాని చెట్లు ఫిబ్రవరి తర్వాత భారీ ఎత్తున పూత పూశాయి. తీరా పిందె దశలో ఎక్కడి పూత అక్కడే మలమల మాడిపోయి పిందెలు రాకుండా పోతున్నాయి. పగటిపూట మండుతున్న ఎండ, రాత్రివేళ మంచు ఈ పంటకు శాపంగా మారాయి. విభిన్న వాతావరణ పరిస్థితుల వల్ల 70 శాతం పూత మాడిపోయింది. పిందెదశ వచ్చేనాటికి కాయలు రాకుండానే మాడిపోతున్నాయి. తేనెమంచు పురుగు, కాండం తొలుచు పురుగు సోకి పిందెలు రాకుండా పోతున్నాయి. జిల్లాలో మామిడికి రాజంపేట డివిజన్‌లోని రైల్వేకోడూరు, వీరబల్లి పెట్టింది పేరు. ఈ సీజన్‌లో సుమారు 30 వేల ఎకరాల్లో విస్తారంగా మామిడి సాగైంది. ఏడాదికి రూ.250 కోట్లకు పైబడి మామిడి వ్యాపారం జరుగుతుంది. ఏడాది పొడవునా ఇంటిల్లిపాది కష్టపడి దుక్కులు దున్నుతూ నీరు కట్టుకుంటూ మందులు పిచికారీ చేస్తూ సస్యరక్షణ చర్యలు చేపడుతూ ఎకరాకు కనీసం 30 నుంచి 40 వేల వరకు ఖర్చు పెడుతున్నా ఉపయోగం లేదు. ఈ ప్రాంతంలో నీలేషా, బేనీషా, రుమాని, బెంగళూరు, పునాస, నీలం తదితర 30 రకాల మామిడి కాయలు పండుతాయి. ఒక్క రైల్వేకోడూరు మార్కెట్‌యార్డు ద్వారానే మే నుంచి ఆగస్టు వరకు రూ.250 కోట్ల వ్యాపారం జరుగుతోంది. ప్రతిరోజూ 10 నుంచి 50 లారీల వరకు దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు మామిడి కాయలను తీసుకెళతాయి. వీరబల్లి బేనీషాకు అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అటువంటి మామిడికి ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించగా ప్రధానంగా తేనెమంచు పురుగు ఎక్కువై పూర్తిగా రాలిపోతోంది. పూతదశ నుంచి పిందె దశకు మారే సమయంలో పూర్తిగా దెబ్బతినడం పట్ల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామూలుగా ఒక ఎకరాకు 10 టన్నులకు పైబడి దిగుబడి రావాల్సి ఉండగా ఐదు టన్నులు కూడా వచ్చే అవకాశాలు లేకుండాపోతున్నాయి. తేనెమంచు పురుగుతో రసం పీల్చి పిందెలు రాకుండా పూతదశలోనే మాడిపోతున్నాయి. రైతులు సంబంధిత ఉద్యాన అధికారులతో మాట్లాడి తేనెమంచు పురుగు నివారణకు డైనోటో ఫ్యూరాన్ మందును కలిపి పిచికారీ చేస్తున్నారు. విరివి గా మందులు పిచికారీ చేస్తున్నా ఉపయోగం ఉండడంలేదు. దీనివల్ల ఈ ఏడాది దిగుబడి తగ్గి మామిడి రైతులు భారీ ఎత్తున నష్టపోయే అవకాశం ఉంది.



పిందె దశలో మాడిపోతున్న మామిడి పూత



రైల్వేకోడూరు ప్రాంతంలో విస్తారంగా పూసిన మామిడి పూత



తేనెమంచు పురుగు సోకి మాడిపోతున్న మామిడి పూత

ముందస్తు జాగ్రత్తలు పాటించాలి



ముందస్తు జాగ్రత్తలు పాటించి సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్లను నివారించి దిగుబడి పెంచుకోవచ్చు. మామిడికి తేనెమంచు పురుగు సోకడం మామూలే. బాగా పూత పూసి పిందెలు వచ్చే సమయంలో ప్రస్తుతం తెల్లవారుజామున మంచు, పగటిపూట తీవ్ర ఉష్ణోగ్రతలు ఉండడం వల్ల తేనెమంచు పురుగు సోకుతోంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 3 మి.లీ. లేదా తయోమిథాగ్‌సమ్ 0.3 గ్రాములు లేదా బుప్రోఫూజన్ 1.05 మి.లీ, ఎక్సాకోనజోల్ 2 మి.లీ, బోరాన్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే తేనెమంచు పురుగును నివారించవచ్చు. ఇతరత్రా తెగుళ్లను బట్టి మందులను పిచికారీ చేస్తే తెగుళ్లు తగ్గి దిగుబడి పెరుగుతుంది.

-సురేశ్‌బాబు, ఉద్యాన శాఖాధికారి, రాజంపేట

లక్షలు ఖర్చు చేసినా ప్రయోజనం లేదు



మాకు 15 ఎకరాల మామిడి తోట ఉంది. ఈ తోటలో ఏడాదికి 5 సార్లు దుక్కులు, మందుల పిచికారీ తదితరాలకు ఎకరాకు రూ.30 వేలు ఖర్చు వస్తోంది. అయితే అనుకున్న మేర మొదట్లో పూత రాలేదు. ఆలస్యంగా పూత వచ్చింది. 15 ఎకరాల మామిడి పంటకు గాను కేవలం 7 ఎకరాల్లో మాత్రమే పూత వచ్చింది. ఈ పూత కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించగా బంక తెగులు సోకడంతో పిందె దశలోనే మాడిపోతోంది. దీని వల్ల దిగుబడి తగ్గి పెట్టిన పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేదు.

-ఎ.శంకరయ్య, గొబ్బూరువారిపల్లె, ఓబులవారిపల్లె మండలం

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం

- టీటీడీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు
- టీటీడీ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి

వాల్మీకిపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టాభి రామాలయంలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి టీటీడీ ఆధ్వర్యంలో జరగనున్న బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టాభిరామాలయంలో ఆలయ అధికారులు, ప్రజలతో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో చక్రస్నాన ఘట్టం వీక్షించలేకపోతున్నామని, ఈ ఏడాది కూడా నామమాత్రంగా గంగాళంలో కాకుండా ఆలయానికి చెందిన గరుడ పుష్కరిణిలో నీటి సౌకర్యం కల్పించి చక్రస్నాన ఘట్టం భక్తులంతా తిలకించేలా చూడాలని విన్నవించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టంగా భావించే పార్వేట మండపం మరమ్మతులు పూర్తి చేయాలని, ఆలయంలో తాగునీరు, మొబైల్ మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఉండేలా చూడాలని మరికొందరు విన్నవించారు. మూడేళ్లుగా టీటీడీ పట్టించుకోవడం లేదన్న వాదనలు కూడా సమావేశంలో వినిపించాయి. స్పందించిన డిప్యూటీ ఈవో మాట్లాడుతూ ప్రజలు తన దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించడమే కాకుండా బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో కంటే మెరుగైన ఏర్పాట్లతో ఈ ఏడాది రాముడి బ్రహ్మోత్సవాలు భక్తులను తప్పక మంత్ర ముగ్ధులను చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్ రెడ్డి, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు కృష్ణప్రసాద్ భట్టార్, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, వివిధ పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు, యువత ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటి ఏరియా ఆస్పత్రికి క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరు

రాయచోటి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకంలో భాగంగా రాయచోటి ఏరియా ఆస్పత్రికి క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరైంది. రాష్ట్రానికి 5 మంజూరు కాగా అందులో రాయచోటి ఒకటి. ఇందులో భాగంగా 50 బెడ్లు, అత్యాధునిక క్రిటికల్ కేర్ ఐసీయూ విభాగం ఏర్పాటు కానున్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.23 కోట్ల 75 లక్షలు ఖర్చు చేయనున్నారు. రాష్ట్రానికి మొత్తం రూ.118.75 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

చుక్కలు చూపించిన సెవెన్‌హిల్స్

- ఏడు గంటలు ఆలస్యంగా నడిచిన రైలు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



సెవెన్‌హిల్స్ సూపర్‌ఫాస్ట్ రైలు

ములకలచెరువు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ములకలచెరువు మీదుగా తిరుపతికి నడిచే సెవెన్‌హిల్స్ సూపర్‌ఫాస్ట్ రైలు ప్రయాణికులకు చుక్కలు చూపించింది. రైలు ఏకంగా ఏడు గంటల పాటు ఆలస్యంగా నడిచింది. దీంతో ప్రయాణికులు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. సాంకేతిక కారణాలతో రైలు సికింద్రాబాద్ జంక్షన్ నుంచి ఆలస్యంగా బయలుదేరింది. రైలు ములకలచెరువుకు బుధవారం తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 9.49 గంటలకు వచ్చింది. తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్లాల్సిన రైలు మధ్యాహ్నం 12.11 గంటలకు చేరింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. అలాగే రైలు కోసం గంటల తరబడిగా రైల్వేస్టేషన్లలో వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో 15 శాతం వృద్ధి సాధిస్తాం

- మామిడి రైతులకు సబ్సిడీతో ఆదాయం
- సీఎం సదస్సులో కలెక్టర్ చామకూరి శ్రీధర్



విజయవాడ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో జిల్లాలో 15 శాతం వృద్ధి రేటు సాధిస్తామని విజయవాడలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో బుధవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి వ్యవసాయంలో మరో 13 వేల హెక్టార్ల పొలాలను విస్తరిస్తామని, ఉద్యానవనంలో సూక్ష్మ నీటి పారుదలను, పోస్ట్ హార్వెస్టింగ్ మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరుస్తామని వివరించారు. మామిడిపండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్‌స్టోరేజ్ యూనిట్లను పెంచడం వంటి కార్యక్రమాల ద్వారా 17.54 శాతం వృద్ధి రేటు లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. మామిడిపండ్ల రైతులకు ప్యాకేజింగ్‌కు ఒక రూపాయి సబ్సిడీ ఇవ్వడం ద్వారా రైతులు 9 రూపాయల ఆదాయాన్ని సంపాదించగలుగుతున్నారని వివరించారు. జిల్లాలో మరో 214 ఎంఎస్ఎంఈ యూనిట్లను, అన్ని నియోజకవర్గాలలో ఎంఎస్ఈ పార్కులను ఏర్పాటు చేసి పారిశ్రామిక అభివృద్ధిలో 16.65 శాతం లక్ష్యాన్ని సాధిస్తామని తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా పదివేల కుటుంబాలకు సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేస్తామని, పీఎం కుసుం పథకం ద్వారా మరో 28 వేల సోలార్ పంపులను వ్యవసాయదారులకు అందిస్తామని చెప్పారు. నరేగా పథకం ద్వారా మరో 160 కిలోమీటర్ల రహదారులను నిర్మిస్తామని, హౌసింగ్ పథకం ద్వారా 30 వేల నూతన ఇళ్లను నిర్మిస్తామని పేర్కొన్నారు. సేవా రంగంలో 16 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నామని, పర్యాటక రంగాన్ని మరింత విస్తరించి అవసరమైన చోట్ల స్టార్ హోటళ్లు నిర్మించే దిశగా చర్యలు తీసుకుని లక్ష్యాలను పూర్తి చేస్తామని వివరించారు.

జిల్లాలోని హెచ్‌ఎన్ఎస్ఎస్ రెండవ ఫేజ్ ప్రాజెక్టుకు, వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు, అన్నమయ్య ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసరమని తెలిపారు. హెచ్‌ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా మరో 19 మండలాలకు ఆయకట్టు పెరిగి ప్రజల సరాసరి ఆదాయం రూ.45 వేలకు పైగా పెరుగుతుందని, జీడీపీలో 16వ ర్యాంకును సాధిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన రూ.700 కోట్లు అందించాలని కోరారు. జిల్లాలో ఉద్యోగుల కొరత ఉందని, ముఖ్యంగా రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరత ఉన్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రం రాయచోటి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఇతర అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన దిశానిర్దేశం మేరకు జిల్లా అధికారులందరూ కార్యాచరణ రూపొందించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.

కలెక్టర్‌ను అభినందించిన సీఎం చంద్రబాబు

అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మామిడి రైతుల కోసం చూపిన చొరవను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో మామిడి రైతులు ఎక్కువమంది ఉన్నారని, వారు పండించిన బేనీషా పండ్లకు ప్యాకింగ్ కోసం ఒక రూపాయి సబ్సిడీ ఇవ్వడం ద్వారా వాళ్లు 9 రూపాయలు ఆదాయం సంపాదించగలుగుతున్నారని కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విషయమై వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి అన్నమయ్య జిల్లాలో అమలు చేస్తున్న విధానాన్ని సమగ్రంగా పరిశీలించి మిగతా జిల్లాల్లో కూడా అమలు పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

అన్నమయ్య వర్ధంతి ఉత్సవాలు ప్రారంభం



పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో అన్నమాచార్యులు

రాజంపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పద కవితా పితామహుడు, వేంకటేశ్వరస్వామికి పరమభక్తుడైన తాళ్లపాక అన్నమాచార్యుల 522వ వర్ధంతి వేడుకలు ఆయన స్వగ్రామం తాళ్లపాకలో బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలోని చెన్నకేశవస్వామి ధ్యానమందిరంలోని అన్నమాచార్య విగ్రహానికి ఆలయ అర్చకులు నరేష్ అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి వారిని పల్లకిపై మాడవీధుల్లో ఊరేగించారు. స్వామివారి వర్ధంతి వేడుకలకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ నేతలు సుబ్రమణ్యంనాయుడు పాల్గొన్నారు. అనంతరం సప్తగిరుల గోష్ఠిగానం నిర్వహించారు. సాయంత్రం 108 విగ్రహం వద్ద తిరుపతి అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరింపజేశాయి. కార్యక్రమాల్లో టీటీడీ జేఈ హేమలత, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గ్రామ సర్పంచ్ గౌరీశంకర్, గ్రామ పెద్దలు జవ్వాజి అదృష్టదీపుడు, మోహన్, ఆదినారాయణ, రాజంపేట టీడీపీ మండల అధ్యక్షుడు డీఆర్‌ఎల్ మణి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం నీడలో.. సౌమ్యనాథాలయం

- టీటీడీలో చేరినా అభివృద్ధి శూన్యం

6

వేయి నెలల కంటే శుభకరమైన రాత్రి

- నేడే లైలతుల్ ఖదర్
- ప్రార్థనలు, నమాజులతో జాగారం చేయనున్న ముస్లింలు



విద్యుద్దీపాలంకరణలో పీలేరులోని అబూబకర్ మసీదు

పీలేరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ముస్లింలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే సతామీ రాత్ రానే వచ్చింది. షబే ఖదర్, లైలతుల్ ఖదర్, బడీ రాత్, సతామీ రాత్‌గా పిలువబడే ఈ రేయికి ఎంతో పవిత్రత, ప్రాధాన్యత ఉంది. 'లైలతుల్ ఖదర్ వేయి నెలల కంటే గొప్పది. ఆ రాత్రిలో చేసే ఆరాధన వేయి నెలల్లో చేసే ఆరాధన కంటే గొప్పది' అంటూ మహాప్రవక్త మహమ్మద్ (స.అ.సం) సెలవిచ్చారు. రంజాన్ మాసం చివరి 10 రోజుల్లోని బేసి సంఖ్య రాత్రుల్లో ఉండే లైలతుల్ ఖదర్‌ను జీవితంలో ఒక్కసారైనా సాధించుకుంటే నరకం నుంచి విముక్తి లభించినట్లేనని ఆయన తెలిపారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు, ఫరజ్ నమాజుల తరువాత మహాప్రవక్త (స.అ.సం) తన అనుచరులకు లైలతుల్ ఖదర్ గురించి వివరించారు. లైలతుల్ ఖదర్ రాత్రులలో అల్లాహ్ భూమికి అత్యంత సమీపంలోకి వస్తాడని, ఆ రాత్రులలో ఎక్కడ, ఎవరు, ఎటువంటి ప్రార్థనలు చేసినా ఆయన మన్నిస్తాడని మహాప్రవక్త (స.అ.సం) తెలిపారు. కావున లైలతుల్ ఖదర్ రాత్రులలో ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా మరుసటిరోజు సూర్యోదయం అయ్యేంత వరకు నమాజులు, ప్రార్థనలు, ఖురాన్ పారాయణంలో గడపాలని మహాప్రవక్త (స.అ.సం) తన హదీసుల్లో తెలిపారు. అయితే ఈ రాత్రి అందరికీ అందాలనే లక్ష్యంతో రంజాన్ మాసంలోని 27వ రాత్రి సామూహికంగా ప్రార్థనలు చేసుకోవాలని ఆయన నిర్దేశించారు. సతాయిస్ అంటే ఉర్దూలో 27 అని అర్థం. 27వ రాత్రిని సతాయిస్ కి రాత్ అన్నారు. కాలక్రమంలో అది సతామీగా స్థిరపడిపోయింది. అలా ఈ రంజాన్ మాసంలో సతామీను జిల్లాలోని ముస్లింలు గురువారం రాత్రి జరుపుకోనున్నారు. అందుకోసం మసీదులను రకరకాల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఇఫ్తార్ విందు, రాత్రి జాగారం చేసే వారి కోసం టీ, కాఫీ, మజ్జిగ, శుక్రవారం ఉదయం సెహరీ ఏర్పాట్లు చేశారు.

లైలతుల్ ఖదర్‌లో చేయదగిన ఆరాధనలు

● దువా

ఆ దేవుడు రాసేసిన తలరాతను సైతం మార్చగల శక్తి కేవలం దువా (ప్రార్థన)కు మాత్రమే ఉందని, ధర్మసమ్మతిలో మనకు ఏం కావాలో ఆ అల్లాహ్‌ను బలంగా కోరుకుంటే అది తప్పక నెరవేరుతుందని ముస్లిం మతపెద్దలు చెబుతున్నారు. అందుకని సతామీలో ఎక్కువగా దువా చేసుకోవాలని వారు సూచిస్తున్నారు.

● ఖజా నమాజులు

జీవితంలో మనం చదవకుండా వదిలేసిన లేక తప్పిపోయిన ఫరజ్ నమాజులను ఖజా నమాజులు అంటారు. సతామీ రోజున వీటిని ఎక్కువగా ఆచరించడం వల్ల మనకు తప్పిపోయిన నమాజుల లెక్కను కొంతలో కొంతైనా సరిచేసుకునే అవకాశం ఉంటుంది.

● ఖురాన్ పఠనం

సతామీ రోజున చేయవలసిన ఆరాధనలలో శ్రేష్ఠమైనది ఖురాన్ పఠనం. వీలైనంత ఎక్కువ సేపు ఖురాన్ పఠనంలో గడపాలి.

● సలాతుత్ తౌబా నమాజు

తౌబా అనగా పశ్చాత్తాపం. సలాతుత్ తౌబా నమాజు అనగా మనం చేసిన అన్ని పాపాల పట్ల అల్లాహ్ ముందు పశ్చాత్తాపపడడం. సతామీ రాత్రి ప్రారంభంలో సలాతుత్ తౌబా నమాజు ఆచరించి ఇతర ఆరాధనలు చేస్తే మంచిదని పెద్దల సలహా.

● సలాతుత్ తస్‌బీహ్ నమాజు

సలాతుత్ తౌబా నమాజు తరహాలో పాపాల నుంచి విముక్తి కల్పించే మరో నమాజు సలాతుత్ తస్‌బీహ్ నమాజు. దీనిని ప్రతి మనిషి ప్రతిరోజు ఆచరించాలని మహాప్రవక్త మహమ్మద్ (స.అ.సం) తెలిపారు. అలా వీలుగాని వారు వారంలో ఒకసారిగానీ, అదీ వీలుగాని వారు ఏడాదిలో ఒకసారిగానీ, అదీ వీలుపడని వారు తమ జీవితంలో ఒక్కసారైనా ఆచరించాలని ఆయన తెలిపారు. సతామీ రోజున ఈ నమాజు ఆచరించడం ద్వారా సకల పాపాల నుంచి విముక్తి కలుగుతుందని పెద్దలు తెలిపారు.

పెద్దఎత్తున నీటి కుంటల పనులు చేపట్టాలి

- డ్వామా పీడీ వెంకటరత్నం



కూలీలతో మాట్లాడుతున్న పీడీ

రాయచోటిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో సేద్యపు నీటి కుంటల పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం ఆయన ఏపీడీ మధుబాబుతో కలిసి రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామం పాత సైకంవాండ్లపల్లె వద్ద ఉపాధి హామీ పథకంలో భాగంగా చేస్తున్న సేద్యపు నీటి కుంట పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతన్నలకు అండగా నిలవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న 1.50 లక్షల సేద్యపు నీటి కుంటల నిర్మాణంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున చేపట్టాలని తెలిపారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 గంటలకే పనికి రావాలని, కనీసం 4 గంటల పాటు పనులు చేయాలని ఆయన కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో రమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రుడి హుండీ ఆదాయం రూ.27.54 లక్షలు

6

నిర్లక్ష్యం నీడలో.. సౌమ్యనాథాలయం




● శిథిలమవుతున్న నిర్మాణాలు ● పునరుద్ధరణపై అధికారుల నిర్లక్ష్యం
● టీటీడీలో చేరినా అభివృద్ధి శూన్యం ● భక్తుల ఆశలు ఆవిరి

నందలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చారిత్రాత్మక నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయ అభివృద్ధికి పురావస్తుశాఖ అడ్డుకట్టలా మారింది. ఈ ఆలయం చోళరాజుల నిర్మాణ శైలికి ప్రతీకగా నిలుస్తుంది. శతాబ్దాలుగా ఈ ఆలయం వైష్ణవుల పుణ్యక్షేత్రంగా వెలుగొందుతోంది. ఈ ఆలయంలోని మూలవిరాట్‌ను దైవర్షి నారదుడు ప్రతిష్ఠించినట్లుగా చెబుతారు. వాగ్గేయకారుడు అన్నమయ్య పూజలందుకున్న స్వామి కొలువైన ఆలయంగా 2022 డిసెంబరు 31న ఆలయ ఉత్తర ప్రహరీ గోడలోని కొంతభాగం కూలిపోయింది. దానిని పరిశీలించిన పురావస్తుశాఖ అధికారులు వీలైనంత త్వరగా గోడను నిర్మిస్తామని తెలిపారు. కానీ రెండేళ్లు గడిచిపోయినా ఇప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని భక్తులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఆలయంలోని ఉద్యానవనాన్ని పర్యవేక్షించేందుకు పురావస్తుశాఖ అధికారులు కాంట్రాక్టు ప్రాతిపదికన ఒక వ్యక్తిని నియమించారు. కొంత కాలం తర్వారత గార్డెనర్‌ను తొలగించడంతో ఆలయ ఆవరణలోకి పశువులు ఇతర జంతువులు విచ్చలవిడిగా ప్రవేశించడమే కాక భక్తులపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. టీటీడీ వారు ఏర్పాటు చేసిన జల ప్రసాదం వద్ద తాగునీరు రాక భక్తులు దప్పికతో అలమటిస్తున్నారు. ఆలయం బయట ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో ఆ ప్రాంతమంతా దుర్గంధం వ్యాపిస్తోంది. దీంతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయాన్ని టీటీడీ వారు తమ అధీనంలోకి తీసుకోవడంతో భక్తులకు ఎన్నో సౌకర్యాలు ఏర్పడుతాయని, అన్నదానం చేస్తారని భక్తులు విశ్వసించారు. అయితే, రెండేళ్లు గడుస్తున్నా వారి ఆశలు నెరవేరలేదు. వసతుల కల్పనలో అటు టీటీడీ, ఇటు పురావస్తుశాఖ రెండూ విఫలమయ్యాయని భక్తులు ఆరోపిస్తున్నారు. నేడు ఆలయానికి జిల్లా నుంచే కాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించి వారి మొక్కులు తీర్చుకుంటున్నారు. కోరుకున్న కోర్కెలు తీరిన పలువురు భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ భక్తిని చాటుకుంటున్నారు. భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని పలువురు సూచిస్తున్నారు.



ఆలయ ఆవరణలో యథేచ్ఛగా తిరుగుతున్న పశువులు



కూలిన ఆలయ ప్రహరీ గోడ



నిరుపయోగంగా మారిన టీటీడీ జలప్రసాద కేంద్రం

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



రాయలసీమలోని పురాతన ఆలయాల్లో సౌమ్యనాథాలయం ఒకటి. దేవాలయ దక్షిణ దిశన కూలిన గోపురం, ఉత్తర దిశన కూలిన ప్రహరీగోడ పునర్నిర్మాణం వాస్తు రీత్యా చాలా ముఖ్యం. ఒంటిమిట్ట కోదండరామాలయం తరహాలో అభివృద్ధిపై టీటీడీ దృష్టి పెట్టాలి. అభివృద్ధికి పురావస్తుశాఖను ఒప్పించాలి.

- పసుపులేటి శంకర్, అధ్యక్షుడు పోతన సాహిత్య పీఠం

ప్రభుత్వం కృషి చేయాలి



సౌమ్యనాథ దేవాలయం రెండేళ్ల క్రితం టీటీడీ ఆధీనంలోకి వెళ్లినా అభివృద్ధికి నోచుకోలేదు. దేవాలయం తరపున అన్నదానం నిర్వహించడం లేదు. తూర్పు వైపు గోడ కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా బాగుచేసే ఆలోచన కనిపించడం లేదు. ఈ దేవాలయం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయాలని కోరుకుంటున్నా.

- అరిగె రాంప్రసాద్, బీజేపీ కోకన్వీనర్, రాజంపేట

స్వాస్థ్య ఆస్పత్రిలో సీటీస్కాన్ ప్రారంభం



సీటీ స్కాన్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న పద్మభూషణ్ ముంతాజ్అలి

మదనపల్లె టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రోగులకు నామమాత్రపు ఫీజులతో మెరుగైన వైద్యసేవలందించేందుకు స్వాస్థ్య ఆస్పత్రిని నిర్వహిస్తున్నామని పద్మభూషణ్ ముంతాజ్అలి తెలిపారు. బుధవారం స్థానిక సత్సంగ్ ఆశ్రమం ఆవరణలోని స్వాస్థ్య ఆస్పత్రిలో సీటీ స్కానర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్ల క్రితం కేంద్రమంత్రి నితిన్‌గడ్కారి ప్రారంభించిన స్వాస్థ్య ఆస్పత్రిలో 15 వేల మంది అవుట్‌పేషెంట్లకు, 230 మంది ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలందించామన్నారు. వీటితో పాటు అత్యాధునిక వాహనంలో గ్రామాల్లో ఆరోగ్య, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. తక్కువ ఖర్చుతో రోగులకు చికిత్స అందించడంతో పాటు, సీటీ స్కానర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం సీటీ స్కానర్ దాతలు కేంబ్రిడ్జికి చెందిన అజయ్‌భాటియా, అల్ట్రా సౌండ్ స్కానర్ దాత పూణెకు హెచ్ఎన్‌బీ ఇంజనీర్స్ ప్రైవేటు లిమిటెడ్ వారికి ఆస్పత్రి వర్గాలు కృతజ్ఞతలు తెలియజేశాయి. డైరెక్టర్ డాక్టర్ వెంకటరమణ, శోభ వెంకట్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రకొండకు నిప్పు



కాలిపోతున్న పొదలు

నిమ్మనపల్లి, మార్చి 26(ఆంధ్ర జ్యోతి): మండలంలోని తవళం పంచాయతీ నల్లంవారిపల్లి సమీపంలోని ఎర్రకొండకు బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. సమీప గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. తవళం గ్రామం మొత్తం అటవీ ప్రాంతం కావడంతో అడవి మొత్తం మంటలు వ్యాప్తిచెందే అవకాశం ఉంది. వేసవికారణం గా పశువులకు మేత దొరకని పరిస్థితుల్లో నిప్పు పెట్టడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పొలంలోని షెడ్‌కు నిప్పు





దగ్ధమవుతున్న షెడ్, కాలిపోయిన బైక్

రామసముద్రం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పొలంలోని షెడ్ దగ్ధమైంది. మండల కేంద్రానికి చెందిన భరత్‌రెడ్డి పొలంలోని షెడ్‌కు బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో వ్యవసాయ పనిముట్లు, స్ప్రేయర్, 200 మీటర్ల కేబుల్ వైర్, 10 కట్టల మల్చింగ్ పేపర్, 7 క్యాన్ల నీమ్ ఆయిల్‌తోపాటు, ఒక ద్విచక్ర వాహనం, టిల్లర్ అగ్నికి ఆహుతయ్యాయి. విషయం తెలుసుకున్న రైతు అగ్ని మాపక సిబ్బంది సమాచారం అందించారు. వారు వచ్చేలోపు అన్ని వస్తువులు కాలి బూడిదయ్యాయి. సీఐ సత్యనారాయణ, ఎస్ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కాగా, బాధిత రైతుకు, ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మధ్య భూమికి సంబంధిత తగాదా నేపథ్యంలో ఈ సంఘటన జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నాటుసారా విక్రేత అరెస్టు

మదనపల్లె టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం సీటీఎం హరిజనవాడ వద్ద నాటుసారా విక్రయిస్తున్న వై.హరీష(27)ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. బుధవారం ఎక్సైజ్ ఎస్ఐలు డోర్కాస్, జబీవుల్లా, సిబ్బంది సీటీఎం హరిజనవాడలో తనిఖీలు నిర్వహించి హరీష్‌ను అదుపులోకి తీసుకుని, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అతడికి నాటుసారా సరఫరా చేసిన వాల్మీకిపురం మండలం మేకలవారిపల్లెకు చెందిన ఎం.మల్లికార్జునపై కూడా కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో హెచ్‌సీ శ్రీనివాసులు, వీరనాగయ్య, పీసీలు నాగరాజు, మధు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఐదుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లె, చౌడేశ్వరి సర్కిల్‌లో మంగళవారం రాత్రి ఇరువర్గాలు గొడవపడ్డాయి. మద్యం సేవించి రాడ్లు, కొడవళ్లతో దాడులు చేసున్నారు. ఈ ఘర్షణకు సంబంధించి శశి , శ్రీకాంత్, శివనాగ, రాజేష్, లోకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. కేసు విచారణలో ఉందన్నారు.

వీరభద్రుడి హుండీ ఆదాయం రూ.27.54 లక్షలు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు, అధికారులు

రాయచోటి టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): హుండీలోని కానుకల ద్వారా వంద రోజులకు గాను వీరభద్రాలయానికి రూ.27.54 లక్షలు ఆదాయం వచ్చినట్లు జిల్లా దేవదాయ శాఖ అధికారి శివయ్య తెలిపారు. స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానం హుండీల్లోని కానుకలను బుధవారం లెక్కించారు. వీరభద్రస్వామి హుండీ ద్వారా రూ. 19,51,890 , భద్రకాళి ఆలయ హుండీ ద్వారా రూ.3,76,325, విఘ్నేశ్వరాలయ హుండీ ద్వారా రూ.1,33,790, అఘోరలింగేశ్వరస్వామి హుండీ ద్వారా రూ. 1,05,560 , సుబ్రమణ్య స్వామి, కాలభైరవ స్వామి,నవగ్రహ మండపం హుండీల ద్వారా వచ్చిన రూ.49,170తో కలపి మొత్తం రూ.26,16,735లను రాయచోటి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేశారు. అన్నదానం హుండీ ఆదాయం రూ. 1,39, 071ని స్టేట్ బ్యాంకులోని అన్నదానం అకౌంట్‌లో జమ చేసినట్లు ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి తెలియజేశారు. అలాగే 17.100 గ్రాముల బంగారం. 2.200 కేజీల వెండి భక్తులు సమర్పించారని తెలిపారు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది కుమారస్వామి, సురేశ్‌కుమార్, విద్యాసాగర్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ హుండీ ఆదాయం రూ.4.05 లక్షలు



గుర్రంకొండ: హుండీలోని కానుకలు లెక్కిస్తున్న అధికారులు

గుర్రంకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారి హుండీని బుధవారం దేవదాయశాఖ అధికారి శశికుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. రెండు నెలలకు రూ.4,05,053 నగదు, 4 గ్రాముల బంగారం, 100 గ్రాముల వెండి వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని అమ్మవారి ఆలయం అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈఓ మంజుల, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట సంఖ్య నమోదు రైతులకు తప్పనిసరి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రామాపురం, మార్చి26(ఆంధ్రజ్యోతి): రైతులు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఈ విశిష్ట సంఖ్య ఉన్న రైతులు భవిష్యత్తులో, అనుబంధ శాఖల ద్వారా వచ్చే పథకాలకు అర్హులని తెలిపారు. పంటల బీమా పథకం, దాని వలన రైతులకు కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సీఎం యాప్‌లో వివరాలు నమోదు చేయించుకున్న రైతుల నుంచి మాత్రమే ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,550 కనీసం మద్దతు ధరతో కంది కొనుగోలు చేస్తుందన్నారు. రాయచోటి మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు రైతులకు తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం పై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి, మండల వ్యవసాయ అధికారిణి నాగమణి, రైతు సేవా సిబ్బంది మంజుల, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

● ఆలస్యంగా స్పందించిన బీసీ సంక్షేమశాఖ అధికారులు

రాయచోటిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ కోసం నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగుల సంక్షేమ సాధికారిత అధికారి సురేశ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లాకు చెంది, ఏపీ టెట్‌లో అర్హత సాధించిన బీసీ, ఈడబ్ల్యూసీ, ఈబీసీ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులన్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.ఖాళీ దరఖాస్తు ఫారాలు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ కార్యాలయంలో లభిస్తాయన్నారు. అలాగే టెట్‌కు అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తుకు టెట్‌లో పొందిన అర్హత పత్రంతో పాటు 2 ఫొటోలు, విద్యార్హతకు సంబంధించిన సర్టిఫికెట్లు, కులం, ఆదాయం, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, నేటివిటీ తదితర జిరాక్స్ కాపీలను దరఖాస్తుకు జతపరిచి, పూర్తి చేసిన దరఖాస్తును అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరతగుల సంక్షేమశాఖ కార్యాలయంలో అభ్యర్థులే స్వయంగా అందజేయాలన్నారు.

ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9912445108, 7989819470 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ నెల 10 నుంచి దరఖాస్తులను తీసుకుంటున్నప్పటికీ అధికారులు 16 రోజుల అనంతరం ప్రకటన ఇవ్వడంపై నిరుద్యోగ యువతీ, యువకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈపై దాడి?!

మదనపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలోని తంబళ్లపల్లె గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ములకలచెరువు ఏఈపై దాడి జరిగినట్లు తెలిసింది. కార్యాలయంలో పనిచేసే ఉద్యోగినిని ములకలచెరువు ఏఈ అసభ్యకరంగా దూషించడంతో ఆమె కుటుంబ సభ్యులు కార్యాలయానికి వచ్చి దాడి చేసినట్లు సమాచారం. ఈ విషయం పట్టణమంతా వ్యాపించడంతో మీడియా ప్రతినిధులు ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి వెళ్ళి విచారించగా అధికారులు అలాంటిదేమి జరగలేదని సమాధానం ఇచ్చారు. కొందరు మాత్రం చిన్న పాటి గొడవ రావడంతో సర్దేశామని, ఇంతటితో వదిలేయమని చెప్పారు. ఉన్నతాధికారులు మాత్రం ఈ విషయం బయటకు పొక్కకుండా లోలోపలే సర్దుబాటు చేసి పంపించినట్లు తెలుస్తోంది.

యోగాతో పంచేంద్రియాల అదుపు

● యోగా శిక్షకురాలు సుసాన్



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న విదేశీ యోగా మాస్టర్లు

మదనపల్లె టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): యోగాతో పంచేంద్రియాలు అదుపులో పెట్టుకోవడమేకాక, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సిద్ధిస్తుందని అమెరికాకు చెందిన ట్రెడిషనల్ మెడిటేషన్ ప్రాజెక్టు యోగా శిక్షకురాలు మిస్ సుసాన్ వివరించారు. బుధవారం స్థానిక విజయభారతి హైస్కూల్లోని విద్యార్థులకు ఆమె యోగాపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సేతు మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాలకు యోగాలో ఆది గురువు భారతదేశమే అన్నారు. చిన్నతనం నుంచి యోగా సాధన చేస్తే ఏకాగ్రత సాధించవచ్చన్నారు. అనంతరం రష్యా శిక్షకురాలు మిస్ సారా, అమెరికాకు చెందిన మిస్ లిండా యోగాపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నిశ్చిత, ట్రెడిషనల్ మెడిటేషన్ ప్రాజెక్టు ఇన్‌చార్జి వి.కవిత, శివకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

టమోటా ఆదాయం ఖర్చులకే సరి!

● గిట్టుబాటు కాక పొలంలోనే వదిలేసిన రైతులు




పొలంలోనే వదిలేసిన టమోటపంట

లక్కిరెడ్డిపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ధర పడిపోవడం, కోత కూలి, మార్కెట్‌కు తరలించేందుకు అయ్యే వ్యయం పెరిగిపోవడంతో ఈ ఏడాది టమోటా పంట నష్టాలనే మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కోనంపేట,పందిళ్లపల్లె, దప్పేపల్లె, మద్దిరేవుల, కాకుశవరం గ్రామాల్లో రైతులు పెద్ద ఎత్తున టమోటా సాగుచేశారు. ఆశించిన స్థాయి లో దిగుబడి కూడా వచ్చింది. అయితే, మార్కెట్‌లో ధర పడిపోయింది. కోతకు ఒక్కో కూలీకి రోజుకు రూ.500, ఒక్కో బుట్టకు రూ.200 చెల్లించి మార్కెట్‌కు తరలిస్తే 20 కిలోలు ఉన్న క్రేట్ 50 రూపాయలకు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు. వేల రూపాయల ఖర్చు పెట్టి పంట సాగుచేస్తే పెట్టుబడి కూడా రాలేదని టమోట రైతు మహబూబ్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్రీయ విద్యాలయం ప్రారంభానికి కసరత్తు!

» స్థలం స్వాధీనం ప్రక్రియ వేగవంతం
» ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు..
» తాత్కాలిక భవనాల్లో తరగతుల నిర్వహణ





కేంద్రీయ విద్యాలయానికి కేటాయించనున్న స్థలం, తరగతులు నిర్వహించనున్న తాత్కాలిక భవనాలు

మదనపల్లె టౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ప్రాంత ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌లో తరగతులు ప్రారంభించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్ చివర లేదా మే నెలలో నాలుగు తరగతులకు అడ్మిషన్లు జరిగే అవకాశం కనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో స్థల సేకరణ, కేటాయింపు ప్రక్రియ ఆలస్యం కావడంతో అప్పట్లో అడ్మిషన్లు అటకెక్కాయి.

సాకారం కానున్న స్వప్నం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విద్యాహబ్‌గా భావిస్తున్న మదనపల్లెలో ఇప్పటికే కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జవహర్ నవోదయ విద్యాలయ నిర్వహిస్తున్నారు. గత డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా 85 ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయ సంఘటన్ ఏర్పాటుకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

స్థల కేటాయింపులో నిర్లక్ష్యం

మదనపల్లెలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు 6 ఎకరాల స్థలం కావాలని ఏడాదిన్నర క్రితం కేంద్రీయ విద్యాలయ సౌత్‌జోన్ అధికారులు కోరడంతో మదనపల్లె మండలం వలసపల్లె వద్ద రెవెన్యూ అధికారులు స్థలాన్ని గుర్తించినా, కేటాయింపులో అప్పటి ప్రభుత్వం ఆలస్యం చేసింది. మదనపల్లె పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాల పక్కన తాత్కాలిక భవనాలను ఏర్పాటు చేసి అందులోనే కేంద్రీయ విద్యాలయ నిర్వహించాలని సూచించారు. కాని సౌత్‌జోన్ కేంద్రీయ విద్యాలయ అధికారులు మాత్రం, పక్కాగా స్థలం కేటాయించిన తరువాతే అడ్మిషన్లు ప్రారంభిస్తామని తెగేసి చెప్పారు. దీంతో 2024-25 విద్యాసంవత్సరంలో మదనపల్లె కేంద్రీయ విద్యాలయలో అడ్మిషన్లు నిలిచిపోయాయి.

అడ్మిషన్లకు మార్గం సుగమం..

కేంద్రీయ విద్యాలయాల్లో ఒకటో తరగతి ప్రవేశాలకు ఈ నెల 7 నుంచి 21 వరకు దరఖాస్తులు స్వీకరించారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీలకు 27 శాతం, దివ్యాంగులకు 3 శాతం ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించనున్నారు. అయితే, స్థలం స్వాధీనంలో జరుగుతున్న ఆలస్యం అడ్మిషన్లపై ప్రభావం చూపుతోంది. దీంతో మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ చొరవ తీసుకుని వలసపల్లె పంచాయతీ పరిధిలో సర్వే నెంబర్లు 713/3,4 , 496/2,3 లెటర్లలో 6.09 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసేందుకు స్కెచ్‌లు, స్థల వివరాలతో ఫైలు సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపారు. ఆ స్థలంలో ముళ్లపొదలను తొలగించి, చదును చేసే పనులు ముమ్మరం చేశారు. పట్టణంలోని ఎస్టీ గురుకుల పాఠశాల పక్కన తాత్కాలిక భవనాల్లో కేంద్రీయ విద్యాలయ తరగతుల నిర్వహణకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి కోసం బోరును డీపెనింగ్ చేయిస్తున్నారు. ఈ నెలాఖరులోగా కేంద్రీయ విద్యాలయ స్థలం స్వాధీనం ప్రక్రియ పూర్తి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇదే జరిగితే ఏప్రిల్ నెలాఖరులోగా మదనపల్లె కేంద్రీయ విద్యాలయలో విద్యార్థుల అడ్మిషన్లకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని తెలుస్తోంది.


5 నుంచి 8 వరకు తరగతులు?



మదనపల్లె కేంద్రీయ విద్యాలయలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులను చేర్చుకునే అవకాశం వుంది. ఇప్పటికే మిగిలిన చోట్ల ఏప్రిల్ ఒకటి నుంచి అడ్మిషన్లు ప్రారంభయ్యే సూచనలున్నాయి. వలసపల్లె వద్ద కేంద్రీయ విద్యాలయకు 6.09 ఎకరాల స్థల స్వాధీనం ప్రక్రియ తుదిదశకు వచ్చింది. ఈ విషయాన్ని సౌత్‌జోన్ కేంద్రీయ విద్యాలయ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ మంజునాథ్ దృష్టికి తీసుకెళ్లాం. స్థలం స్వాధీనం అవుతూనే మదనపల్లెలోని తాత్కాలిక భవనాల్లో 5 నుంచి 8 తరగతుల వరకు కేంద్రీయ విద్యాలయలో అడ్మిషన్లు ప్రారంభం అవుతాయి. అంతా సవ్యంగా జరిగితే మదనపల్లె ప్రాంత విద్యార్థులకు ఈ ఏడాదే కేంద్రీయ విద్యాలయం అందుబాటులోకి వస్తుంది.

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ద్విచక్రవాహనాలు ఢీ... టీడీపీ కార్యకర్త మృతి


రాజారెడ్డి మృతదేహం

కలసపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంఖవరం-లింగారెడ్డిపల్లె మధ్యలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో లింగారెడ్డిపల్లెకు చెందిన కొత్తపల్లె రాజారెడ్డి (42) అనే టీడీపీ కార్యకర్త మృతి చెందాడు. రాజారెడ్డి మంగళవారం రాత్రి పోరుమామిళ్లలో తన సొంత పనిముగించుకొని తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా.. మరో ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో గాయపడ్డ రాజారెడ్డిని పోరుమామిళ్ల ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించినట్లు మృతుడి బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



కలసపాడు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేటలో బుధవారం జోసఫ్ (48) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గిద్దలూరు ప్రాంతానికి చెందిన ఇతను కొండపేటలో వివాహం చేసుకుని ఇక్కడే ఉంటూ గొర్రెలు కాసుకొని జీవనం సాగించేవాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గొర్రెల పెంపకం లావాదేవీల్లో అప్పులు కావడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చోరీకి యత్నించిన దొంగ అరెస్టు



ఎర్రగుంట్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): బంగారు గొలుసు చోరీకి యత్నించిన యువకుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎర్రగుంట్ల అర్బన్ సీఐ నరేష్ బాబు వివరాలకు మేరకు... చిలమకూరులో నివాసం ఉంటున్న సంగటి ప్రణయ్‌కుమార్ చెడు వ్యసనాలకు బానిసగా మారి దొంగతనాలకు పాల్పడేవాడు. ఇళ్లలో ఒంటరిగా ఉన్న మహిళలతో మాటమాట కలిపి వారి మెడలో ఉన్న బంగారు నగలను చేసేవాడు. ఈనేపథ్యంలో 24వ తేదీ మధ్యాహ్నం ఎర్రగుంట్ల మహేశ్వరనగర్‌లో చిల్లర అంగడి నడుపుతున్న లక్ష్మిదేవి మెడలోని బంగారు చైన్‌ను లాక్కొనే ప్రయత్నం చేశాడు. ఆమె వెంటనే కేకలు వేయడంతో పారిపోయాడు. ఈమేరకు నిందితుడి కోసం గాలింపు చేపట్టి బుధవారం ఎర్రగుంట్లలో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


ధనలక్ష్మి(ఫైల్ ఫొటో)

ముద్దనూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముద్దనూరు వాసి ధనలక్ష్మి(32) బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలు... ముద్దనూరు కు చెందిన రాజకుళాయప్ప, ధనలక్ష్మి దంపతులు కొంతకాలంగా తాడిపత్రిలో నివాసం ఉంటున్నారు. ధనలక్ష్మి తాడిపత్రి నగరపాలక కార్యాలయంలో నాన్‌స్వీపర్ వర్కర్‌గా పనిచేస్తుంది. వీరి కుమారుడు అకిల్ తాడిపత్రి సమీపంలోని రావివెంకటాంపల్లి వద్ద నున్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కుమారుడి వద్దకు ద్విచక్రవాహనంలో వెళ్లారు. తిరిగి వస్తుండగా తాడిపత్రి సమీపంలో ఎదురుగా ఆటో వచ్చి బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్య, భర్తకు తీవ్రగాయాలయ్యాయి. ధనలక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందింది. మృతదేహాన్ని ముద్దనూరుకు తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు.

గోతిలో పడి గోవు మృతి

వేంపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలోని సాయిబాబా ఆలయం సమీపంలో ప్రమాదవశాత్తు గోతిలో పడి గోవు మృతిచెందింది. కాల్వల కోసం ఇష్టానుసారంగా గోతులు తవ్వి తర్వాత పూడ్చకపోవడంతో గోవులు గోతుల్లో పడుతున్నాయి. మృతిచెందిన గోవుకు బీజేపీ నాయకులు, మానవత సంస్థ ప్రతినిధులు అంతిమసంస్కారాలు నిర్వహించారు.


ప్రొద్దుటూరు డూప్ యార్న్ సిల్క్ తయారీకి భౌగోళిక గుర్తింపు?

- హైదరాబాద్ బీ2బీ రెజల్యూషన్ సంస్థ పరిశీలన

ప్రొద్దుటూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చేనేత జౌళి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరులో డూప్‌యార్న్ సిల్క్ మాధవరం కాటన్ చీరల తయారీకి భౌగోళిక గుర్తింపు ఎంపిక ప్రక్రియకు సంబంధించి హైదరాబాదు బీ2బీ రెజల్యూషన్ సంస్థ నిపుణుల బృందం బుధవారం ప్రొద్దుటూరుకు వచ్చింది. స్థానిక వసంతపేట వీధిలోని చెన్నకేశవ సిల్క్ చేనేత సహకార సంఘాన్ని సందర్శించి డూప్‌యార్న్ సిల్క్ తయారీ విధానాన్ని, ప్రత్యేకతను గురించి తెలుసుకున్నారు. డూప్‌యార్న్ రీలింగ్ యూనిట్ డైయింగ్ యూనిట్ చేనేత మగ్గాలను సందర్శించి డూప్ యార్న్ సిల్క్ తయారీని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ బౌగోళిక గుర్తింపు ప్రొద్దుటూరు డూప్ యార్న్ సిల్క్‌కి వస్తే ప్రొద్దుటూరుకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చి ఇక్కడ చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ పరిశీలన బృందంలో జిల్లా చేనేత జౌళి శాఖ అధికారులు అహ్మద్ మెహిద్దీన్, హైదరాబాద్ బీ2బీ సంస్థ ప్రతినిధులు సీవీ శేషగిరిరావు, ఎన్.రవిప్రకాష్ రెడ్డి వున్నారు. చెన్నకేశవ సిల్క్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు కడప రామిశెట్టి, హరి ప్రకాష్‌లు పాల్గొన్నారు.

రసవత్తరంగా.. గోపవరం ఉప సర్పంచు ఎన్నిక

- 14 మంది వార్డు మెంబర్లతో వైసీపీ క్యాంప్ రాజకీయం
- టీడీపీ పావులు కదుపుతుందా.. లేదా?
- నేడే ఎన్నిక.... పటిష్ట పోలీసు బందోబస్తు



గోపవరం పంచాయతీ కార్యాలయం

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక రసవత్తరంగా మారింది. పంచాయతీలో మొత్తం 20 మంది వార్డు సభ్యులు ఉన్నారు. అప్పట్లో గోపవరం పంచాయతీ ఉపసర్పంచ్ పదవిని రెండున్నర సంవత్సరాలు ఓసీలకు, రెండున్నర సంవత్సరాలు బీసీలకు ఇస్తామని అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఉపసర్పంచ్ బీరం రాఘవరెడ్డి తన కాలపరిమితి ముగిసిన తర్వాత పదవికి రాజీనామ చేశారు. అయితే ఉప ఎన్నిక నోటిఫికేషన్ వెలువడడంలో ఆలస్యమైంది. ఈ తరుణంలో బీసీ వార్డు మెంబరు మండల రమాదేవిని అనధికారికంగా ఉపసర్పంచ్‌గా నిలబెట్టారు. అయితే మారిన రాజకీయ నేపథ్యంలో ఉప సర్పంచ్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడింది. దీంతో ఈనెల 27న ఉపసర్పంచ్‌ను ఎన్నుకోనున్నారు. కాగా, వైసీపీలోని కొందరు వార్డు మెంబర్లు టీడీపీకి మద్దతుగా నిలిచారు. దీంతో మిగిలిన కాలపరిమితిలో కూడా తానే ఉపసర్పంచ్‌గా కొనసాగాలని మునపటి ఉపసర్పంచ్ బీరం రాఘవరెడ్డి ఆశపడ్డారు. ఈ మేరకు వైసీపీ నాయకుల అండతో గత ఆదివారం సుమారు 14 మంది వార్డు మెంబర్లతో క్యాంపు రాజకీయానికి తెరలేపారు. ఎన్నడు లేని విధంగా ఉపసర్పంచ్ ఎన్నికలో కూడా వార్డు మెంబర్లతో క్యాంపు రాజకీయం నడపడంతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. వీరందరిని హైదరాబాదులోని ఓ స్థావరంలో ఉంచి వారికి కావాల్సినవన్ని సమకూర్చుతూ ఎన్నిక సమయానికి నేరుగా ఎన్నిక జరిగే పంచాయతీ కార్యాలయానికి తీసుకురానున్నారు. వార్డు మెంబర్ల సెల్ ఫోన్లు కూడా పనిచేయలేదు. వీరిలో ఎవరు కూడా మాట తప్పకుండా ఉండేందుకు వార్డు మెంబర్లకు ఆశించిన మేరకు వైసీపీ నుంచి తాయిలాలు కూడా అందినట్లు చర్చ జరుగుతోంది. అయితే బీసీ ప్రాతినిధ్యం కలిగిన ఈ పంచాయతీలో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు ఇచ్చిన మాట మేరకు రెండవ విడతగా ఉపసర్పంచ్ అభ్యర్థిగా బీసీ వార్డు మెంబర్‌ను నిలబెడుతారని చెప్పి ప్రస్తుతం మోసం చేయడం ఎంతవరకు సబబు అని పంచాయతీలోని బీసీ నాయకులు వాపోతున్నారు. 14 మంది వార్డు మెంబర్లతో ఉపసర్పంచ్ అభ్యర్థి క్యాంపు రాజకీయాలు నడపడంతో గెలుపునకు అవకాశాలు వైసీపీకే ఉన్నాయని మండలంలో విశ్లేషకులు బేరీజు వేస్తున్నారు. వైసీపీ నేత మాజీ ఎమ్మెల్యే బీసీలకు ఇచ్చిన మాట తప్పారని ఆరుగురు వార్డు సభ్యులు బుధవారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సమక్షంలో తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని తమకు జరిగిన అన్యాయం నేపథ్యంలో వైసీపీని వీడి కూటమి ప్రభుత్వంలోకి చేరుతున్నామన్నారు. అయితే క్యాంపులో ఉన్నవారిలో కొంతమంది బీసీ అభ్యర్థిని ఎన్నుకునేందుకు మొగ్గు చూపుతారని ఆశాభావం కొందరిలో ఉంది. గురువారం జరిగే ఉప ఎన్నికల్లో ఉద్రిక్తత నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఈ ఎన్నికల్లో ఎటువంటి గొడవలకు తావు లేకుండా డీఎస్పీ భావన ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. వార్డు మెంబర్ల చేత చేతిని పైకి ఎత్తే విధానంలో ఉప సర్పంచ్ ఎన్నిక సాగనుంది. ఈ పదవి వైసీపీ ఖాతాలోకి వెళుతుందా, లేదా ఎమ్మెల్యే ప్రమేయంతో బీసీ అభ్యర్థిని ఉపసర్పంచ్‌గా ఎన్నుకునేందుకు పావులు కదుపుతారా అనేది వేచి చూడాల్సి ఉంది.

శంకుస్థాపనలకే పరిమితమైన కడప ఉక్కు పరిశ్రమ

- విద్యార్థులు, యువత భాగస్వామ్యంతోనే సాధ్యం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రం, రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీల నిర్లిప్తతో రాష్ట్ర విభజన హామీలో ఇచ్చిన కడప ఉక్కు పరిశ్రమ ముగ్గురు ముఖ్యమంత్రులు, నాలుగు శంకుస్థాపనలకు పరిమితమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. బుధవారం ఎన్జీవో హోంలో సీపీఎం ఆధ్వర్యంలో కడప ఉక్కు, ఆంధ్రుల హక్కు జిల్లా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చిన హామీలలో కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ప్రధానమైందన్నారు. గత 11 సంవత్సరాలుగా అధికార, ప్రతిపక్ష పార్టీల స్థానాలు మారుతున్నా ఉక్కు పరిశ్రమ సాకారం కావడంలేదన్నారు. ఉక్కు పరిశ్రమ వలన రాయలసీమ ప్రాంతంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష ఉద్యోగాలు వస్తాయని ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయన్నారు. రాజకీయ పార్టీల స్వార్థానికి ఉక్కు పరిశ్రమ బలి అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్కు పరిశ్రమపై మొదటి నుంచి సీపీఎం పోరాటం చేస్తోందన్నారు. యువత, విద్యార్థులకు భాగస్వామ్యం కల్పించినప్పుడే ఉక్కు పరిశ్రమ సాకారం అవుతుందన్నారు. ఇక రాజధాని పేరుతో చంద్రబాబు ఊహా ప్రపంచంలో విహరిస్తే జగన్ చంద్రబాబుపై కోపంతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి, రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టుపై మోడీ ప్రభు త్వం రాష్ట్రంతో దోబూచులాడుతోందని విమర్శించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.చంద్రశేఖర్, జిల్లా సభ్యులు మనోహర్, అన్వేష్, బయన్న, గఫూర్, షరీఫ్, డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్, ముంతాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

3న వైవీయూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్


పోస్టర్‌ను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ

కడప ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి తెలిపారు. విద్యాలయ కులసచివులు, ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధులతో కలిసి ఉద్యోగ డ్రైవ్‌కి సంబంధించిన పోస్టర్‌ను వీసీ చాంబర్‌లో విడుదల చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యోగాల ఎంపికలకు ప్రముఖ మల్టీనేషనల్ బయోఫార్మస్యూటికల్ కంపెనీ బయోకాన్ విద్యాలయానికి రానుందని తెలిపారు. బయోకాన్ కంపెనీలోని ప్రొడక్షన్ విభాగంలో చేరేందుకు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, డిప్లమో కెమికల్, బీటెక్ కెమికల్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగాల కోసం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ అర్హతలు ఉండాలన్నారు. ఇంజనీరింగ్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలలో ఉద్యోగాల కోసం మెకానికల్, ఈఈఈ, ఈసీ, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీఈ, బీటెక్, డిప్లమో అర్హతలు ఉన్నవారు అర్హులన్నారు. 2023, 2024, 2025 బ్యాచ్‌లలో చదివిన, ప్రస్తుత చదువుతున్న విద్యార్థులు మాత్రమే డ్రైవ్‌లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థులు బయోడేటాతో విశ్వవిద్యాలయంలోని ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు హైదరాబాద్, వైజాగ్ నగరాలలో జాబ్ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కులసచివులు ఆచార్య పద్మ, ఆచార్య చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి, డాక్టర్ బి.రెడ్డయ్య, డాక్టర్ ప్రశాంతి మాదక్క, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళ పాల్గొన్నారు.

కడప మార్కెటింగ్ ఈఈగా జయశేఖర్ నియామకం

- కాకినాడలో మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపుల ఆరోపణలు
- 2022లో ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఆదేశాలు
- తొలగింపు చర్యను నిలుపుదల చేస్తూ ప్రస్తుతం కడపకు పోస్టింగ్

కలికిరి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కడప వ్యవసాయ మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ ఇంజినీరుగా కె.జయశేఖర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాకినాడలో పనిచేసే కాలంలో 2014లో ఆయన అదే శాఖలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొన్నారు. వివిధ రకాల విచారణ కమిషన్లు, వివిధ కోర్టులు జయశేఖర్ కేసును విచారించాయి. అన్ని స్థాయిల్లోనూ ఆరోపణలు రుజువు కావడంతో 2022 అక్టోబరు 10న జయశేఖర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ అప్పటి వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఆమేరకు ఆదేశాలు జారీ చేసింది. తాజాగా జయశేఖర్ ప్రభుత్వానికి చేసుకున్న వినతులను పరిశీలించిన ప్రభుత్వం ఉద్యోగం నుంచి ఆయనను తొలగించిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఆపైన కడప వ్యవసాయ మార్కెటింగ్ ఈఈగా నియమిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

టీడీపీలో వర్గపోరు

- గ్రావెల్ రోడ్డు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ
- పోలీసుల రంగప్రవేశం
- సర్దుమణిగిన వివాదం



గొందిపల్లె గ్రావెల్ రోడ్డు ఇదే.., ఘర్షణను నివారిస్తున్న పోలీసులు

వేముల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్గపోరు కారణంగా టీడీపీ శ్రేణులు రచ్చకెక్కాయి. ఓ గ్రావెల్ రోడ్డు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. వివరాలిలా.. గొందిపల్లె గ్రామంలోని పులివెందుల-కడప ప్రధాన రహదారి నుంచి పొలాలకు వెళ్లే మట్టిరోడ్డు కోసం గత ప్రభుత్వంలో రూ.20లక్షల నిధులు మంజూరయ్యాయి. పనులు చేసిన కాంట్రాక్టర్ ఇంకా 20శాతం బిల్లులు రావాలని వివరించాడు. గొందిపల్లె గ్రామంలోని ఎమ్మెల్సీ వర్గీయుడు టీడీపీ నాయ కుడు బొజ్జ మైసూరారెడ్డి గత ప్రభుత్వంలో పూర్తైన మట్టి రోడ్డును మళ్లీ రోడ్డు వేయడానికి రూ.5లక్షల నిధులతో అప్రూవల్ తెచ్చుకున్నాడు. బుధవారం రోడ్డు వేయడానికి టిప్పర్లు, హిటాచి మిషన్ తీసుకెళ్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ మండల యువత అధ్యక్షుడు ఆసం విశ్వేశ్వ ర్‌రెడ్డి అతని అనుచరవర్గం రోడ్డు పనులు జరగకుండా అడ్డుకున్నారు.

ఈ విషయమై వేముల పోలీస్‌స్టేషన్‌లో ఆర్కేవ్యాలీ సీఐ ఉలసయ్య మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్సీ వర్గీయుడు శాంక్షన్ ఆర్డర్ వచ్చిన చోట యదావిధిగా రోడ్డు వేసుకోవచ్చని వివరిం చారు. పంచా యతీరాజ్ ఏఈ అబ్దుల్లాను వివరణ కోరగా.. 2024 డిసెంబరులో జడ్పీ నిధుల కింద రోడ్డు వేసుకోవడానికి అనుమతులు వచ్చాయని, వచ్చిన చోట మాత్రమే మట్టి రోడ్డును వేసుకోవడానికి అనుమతులు వచ్చాయని.. అక్కడ మాత్రమే రోడ్డు పూర్తిచేసుకోవాలని తెలిపారు. కాగా ఇరువర్గాలు గుంపులు ఏర్పడ్డ సమాచారాన్ని తెలుసు కున్న డీఎస్పీ మురళీనాయక్, సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది కార్యకర్తలను చెదరగొట్టి ఘర్షణను సర్దుమణిచారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై న్యాయ విచారణ చేయాలి



కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరుటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగిడాల మృతిపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని రాష్ట్ర మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు రామాజి ఇమ్మానుయేల్ డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఆయన మృతికి నిరసనగా పాత బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం వద్ద పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు, రాష్ట్ర మాలమహానాడు ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగిడాల మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని.. కొందరు హత్యగా పేర్కొంటే మరికొందరు మృతి చెందాడని ప్రచారం చేస్తున్నారన్నారు. మత ప్రచారం చేసుకునే వ్యక్తి మృతిపై అనుమానాలు రావడం దారుణమని.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయ విచారణ జరిపి హత్య జరిగి ఉంటే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మురళీప్రసాద్, ఓబులేసు, కిరణ్‌కుమార్, లక్షుమయ్య, అరుణ్‌కుమార్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యపై ఆత్మహత్యాయత్నం.. ఆర్డీవో విచారణ


బాధితుడు గుడిమె సుధాకర్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రమోహన్

బ్రహ్మంగారిమఠం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల గ్రామానికి చెందిన గుడిమె సుధాకర్ ఇటీవల తన భూసమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ విషయంపై బద్వేలు డివిజను ఆర్డీవో బుధవారం బ్రహ్మంగారి మఠం తహసీల్దారు కార్యాలయంలో విచారణ చేశారు. బాధితుడి సుధాకర్‌తో మాట్లాడి.. భూసమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే భూమికి కొలతలు వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తహసీల్దారుకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, మండలంలో ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హెచ్చరించారు.

రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఎంపిక



కడప ఎడ్యుకేషన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) భౌతిక శాస్త్ర విభాగంలోని మెటీరియల్ ఫిజిక్స్ ప్రొఫెసర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలోగా ఎంపికయ్యారని ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ అనేది యునైటెడ్ కింగ్ డమ్‌లో ఉన్న ఒక ప్రొఫెషనల్ సొసైటీ, ప్రపంచవ్యాప్తంగా 50వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. ఫెలో ఆఫ్ ది రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ హోదా రసాయన శాస్త్రాలకు (మెటీ రియల్ కెమిస్ట్రీ మరియు ఫిజిక్స్‌తో సహా) గణనీయమైన కృషి చేసిన వారికి ఇస్తారు. ఫెలోలను ఇతర సభ్యులు నామినేట్ చేస్తారని ప్రిన్సిపల్ చెప్పారు. డాక్టర్ సుధాకర్‌రెడ్డి పరిశోధన ఇంటర్ డిసిప్లినరీ, భౌతిక, రసా యన, పదార్థ శాస్త్రాలను మిళితం చేస్తుంది. శక్తిమార్పిడి మరియు నిల్వ, డబ్ల్యూఎల్ఈడీలు, లేజర్లు ఫోటోనిక్స్ రంగాలతో పాటు డాక్టర్ రెడ్డి బృందం ప్రస్తుతం క్వాంటం కంప్యూటింగ్, జీవ వైద్య అనువర్తనాల పునాదులలో కొత్త పరిశోధన దశలను అనుసరిస్తోంది. ఆయన పరశోధనకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషనర్, కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, రాష్ట్రీయ ఉత్చతార్ శిక్ష అబియాన్ వంటి అత్యున్నత ప్రభుత్వ నిధుల సంస్థల నుంచి మద్దతు లభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.రామ చంద్ర, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, బోధన, బోధనేతర సిబ్బంది డాక్టర్ బి.సుధాకర్‌రెడ్డిని అభినందించారు.

ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం కింద లబ్ధిపొందడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద తయారీ రంగానికి రూ.50లక్షలు, సేవా రంగానికి రూ.20లక్షల విలువతో ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్న వారికి ప్రాంతం లబ్ధిదారుల వర్గీకరణను బట్టి 15 నుంచి 35శాతం వరకు సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18ఏళ్లు దాటి ఉండాలని, ఆదాయ పరిమితి లేదన్నారు. అభ్యర్థులు కనీసం 8వ తరగతి పాస్ అయి ఉండాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా పంపాలని కోరారు.

దమ్ముంటే పట్టుకోండి ఉప సర్పంచి...

పట్టుకుంటే వదిలేస్తాం పంచాయతీ

● వైసీపీ ఉప సర్పంచుకు వార్డు సభ్యుల సవాల్ ● రైల్వేకోడూరు పంచాయతీలో 9 నెలల్లో ఎన్నడూ జరగని అభివృద్ధి

రైల్వేకోడూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ ఏర్పడి తొమ్మిది నెలలు అం ఖందని, ఎన్నడూ జరగని అభివృద్ధి రైల్వేకోడూరు పంచాయతీలో జరుగుతోందని టీడీపీ యువ నాయకులు, వార్డు సభ్యులు పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, సావిత్రమ్మ, యువ నాయకులు మల్లెం హేమంత్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ఉప సర్పంచ్ వైసీపీ ప్రభుత్వంలో చేసిన పనులు అందరికీ తెలుసన్నారు. అక్రమాలకు తావు లేకుండా అభివృద్ధి జరుగుతోందన్నారు. పంచాయతీ సమావేశాల్లో కోరంతో తీర్మానాలు చేసి పనులు నిర్వహించామన్నారు. కొన్ని పనులకు చెల్లింపులు కూడా జరిగాయన్నారు. చాలా పనులు పూర్తి చేశామన్నారు. పలు సమావేశాలకు వైసీపీ ఉప సర్పంచ్ హాజరు కాలేదన్నారు. త్వరలో అవిశ్వాస తీర్మానం ప్రకటిస్తామన్నారు. రైల్వేకోడూరు పంచాయతీ సర్పంచ్ బుడిగి శివయ్య, పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌పై ఉప సర్పంచ్ కోర్టుకు వెళ్లి ఇబ్బంది పెడుతున్నారన్నారు. వైసీపీ పాలనలో సర్పంచ్‌ని బాగా ఉపయోగించుకుని ఆయన్నే కోర్టుకు లాగడం సమంజసమా అని ప్రశ్నించారు. సర్పంచ్ స్వతహాగా పని చేస్తుంటే ఓర్వలేని ఉప సర్పంచ్ కోర్టును ఆశ్రయించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గిరిజన సర్పంచ్‌కి జరుగుతున్న అన్యాయంపై ఉప సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంఘం కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు.



పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న టీడీపీ వార్డు సభ్యులు

ఏళ్ల తరబడి పరిష్కారం కాని రోడ్లకు మోక్షం

స్థానిక లక్ష్మీపార్వడైజ్ సినిమా హాలు ఎదురుగా రోడ్డుకు కొన్నేళ్లుగా మోక్షం కలుగలేదని, కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమైందన్నారు. కొత్తకోడూరుకు వెళ్లే రోడ్డు కూడా పూర్తి చేశామన్నారు. గిరిజాలేన్, పాత బజారుకు వెళ్లే బిట్ రోడ్డు, పాత బజారు వీధిలో వర్షపు నీరు నిలుస్తోందన్నారు. ఆర్యవైశ్యుల విన్నపంతో అండర్ డ్రైనేజి సిస్టం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

వైసీపీ పాలనలో దుమ్ముపోసినట్లు కాకుండా సిమెంట్ రోడ్లు సుందరంగా తయారు చేస్తున్నామన్నారు. నాణ్యతలో రాజీలేకుండా పనులు సాగుతున్నాయన్నారు. వైసీపీ పాలనలో జరిగినట్లు కూటమి ప్రభుత్వంలో సాగదన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తామన్నారు. ఉప సర్పంచ్‌కి ఎక్కడైనా అక్రమాలు జరినట్లు పట్టుకునే దమ్ముంటే తాము పంచాయతీని వదిలేస్తామంటూ ఈ సందర్భంగా వారు సవాల్ విసిరారు.

సమస్యకు పరిష్కారం



సిద్దవటం మండలం మాధవరం-1, మహబూబ్‌నగర్, ఆలీనగర్ గ్రామాల్లో చాలా కాలంగా నెలకొన్న నీటి సమస్యకు పరిష్కారం లభించిందని సర్పంచ్ జానకిరామయ్య తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.95 లక్షలతో మోటారు, పైపులైను ఏర్పాటు చేశామన్నారు. టీడీపీ రాజంపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు డాక్టర్ వీరభద్రుడు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్య, హరి, మురళి పాల్గొన్నారు.

- సిద్దవటం, (ఆంధ్రజ్యోతి)

నీటి నిల్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ మధుబాబు

సంబేపల్లె, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మొదటి త్రైమాసికం ఏప్రిల్ నుంచి జూన్ వరకు నీటి నిల్వ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధి హామీ పథకం ఏపీడీ మధుబాబు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు. కూలీకి రోజుకు రూ.290 తగ్గకుండా చూడాలన్నారు. పశువుల నీటి తొట్ల పనులు, నిర్దేశించిన ఫామ్ ఫాండ్ పనులు చేపట్టాలన్నారు. వీటితో పాటు పంట కాలువల పూడికతీత పనులు, సాగునీటి చెరువుల పూడితీత పనులను చేపట్టాలన్నారు. ఐదు ప్రధాన అంశాలకు సంబంధించిన ఈ పనులను చేపట్టాలని తెలియజేశారు. కూలి సగటు వేతనం రోజుకు రూ.290 తగ్గితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి పలు అంశాలపై సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్ర, ఏపీవో రెడ్డిజవహర్, ఉపాధి హామీ జేఈ వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి: టీడీపీ

గాలివీడు, మార్చి26(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని గోరాన్‌చెరువు పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు మంచినీటి సౌకర్యం కల్పించడానికి చర్యలు చేపట్టామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 200పైగా మంచినీటి బోర్లు వేశామన్నారు. మాజీ ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఉదయ్‌కుమార్, అంజనేయులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నరసింహులు



దాసరి నరసింహులు



షేక్ మహమ్మద్ అలీ

నందలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బుధవారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో దాసరి నరసింహులు ఐదోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కృష్ణారెడ్డి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ ఓటింగ్‌లో 21 మంది అడ్వకేట్లు పాల్గొనగా ఐదు ఓట్ల మెజారిటీతో దాసరి నరసింహులు గెలుపొందారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తనను తిరిగి అధ్యక్షుడిగా ఎన్నుకోవడం సంతోషంగా ఉందన్నారు.

నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు కొత్త భవనం నిర్మాణం కోసం ప్రయత్నిస్తానన్నారు. తన గెలుపునకు సహకరించిన సహ న్యాయవాదులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ మహ్మద్‌అలీ, జనరల్ సెక్రటరీగా గొబ్బిళ్ల సుబ్బరాయుడు, జాయింట్ సెక్రటరీగా నాయనపల్లి అనుదీప్ జైసింహా, ట్రెజరర్‌గా వినయ్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ముంగి మోహన్, లైబ్రరీ సెక్రటరిగా స్వేచ్ఛ, లేడీ రెప్రెజెంటేటివ్‌గా మాడపూడి నళిని, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్‌గా ఓవీ కృష్ణారెడ్డి, హెచ్.ఆనంద్‌కుమార్, డి.మల్లికార్జున, ఆకేపాటి శివకుమార్‌రెడ్డిలను ఎగ్జిక్యూటివ్ బాడీగా నియమించారు.

ఆర్‌పీఐ అధ్యక్షుడిని కలిసిన సమతా సైనికదళ్ జిల్లా అధ్యక్షుడు

ఓబులవారిపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలెను న్యూఢిల్లీలోని ఆయన గృహంలో కలిసినట్లు సమతా సైనిక్ దళ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చౌడవరం సుబ్బనరసయ్య తెలిపారు. ఆర్పీఐ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎం.వెంకటస్వామి, కర్ణాటక స్టేట్ జనరల్ సెక్రెటరీ వెంకటరమణప్పను కలిసి ఎస్సీ ప్రజల ఇబ్బందులు, కేసులు, ఉపాధి అవకాశాలు, సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపు వంటి అంశాలపై పట్టించుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు.

రేపు హుండీ లెక్కింపు

సిద్దవటం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వంతాటిపల్లె లంకమల్ల అడవుల్లో వెలసిన నిత్యపూజేశ్వర ఆలయ హుండీ లెక్కింపు మార్చి 28న ఉదయం 10 గంటలకు జరుగుతుందని ఆలయ ఈవో శ్రీధర్ అన్నారు. భక్తులు హుండీ లెక్కింపు పరకామణిలో పాల్గొనాలన్నారు.

ఘనంగా అన్నమయ్య వర్ధంతి



అన్నమయ్య వర్ధంతిలో పాల్గొన్న కళాకారులు

రాయచోటిటౌన్, మార్చి26(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో సత్యసాయిబాబా మందిరంలో బుధవారం పదకవితా పితామహుడు అన్నమయ్య 522 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి అన్నమాచార్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి సౌజన్యంతో లక్కిరెడ్డిపల్లెకు చెందిన వెంకటేశ్వర కళామండలి (ఎస్వీఆర్‌డీఎస్) అధ్యక్షుడు తుమ్మల హరినాథ్ ఆధ్వర్యంలో అన్నమయ్య సంకీర్తన ఆలాపన నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకుడు తుమ్మల హరినాథ్ మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి మీద 32 వేల సంకీర్తనలు రచించి, గానం చేసిన ఘనత అన్నమయ్యకే దక్కిందన్నారు. అన్నమయ్య జిల్లా కళాకారులు రెడ్డెయ్య, రిటైర్ టీచర్ భాస్కర్ రెడ్డి, లక్ష్మీదేవి, సరోజ, నాగలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, నారమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన బలిజపల్లె గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బలిజపల్లె గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా బుధవారం రాత్రి ప్రారంభమైంది. అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. వేలాది మంది భక్తులు పూజలు చేశారు. భక్తులు వివిధ రకాల వేషాలు వేసి అలరించారు. గురువారం ఉదయం పొంగుబాళ్లు పెట్టుకుంటారు. ఆలయ నిర్వాహకులు శోడిశెట్టి కుటుంబీకులు భక్తులు ఇబ్బందులు పడకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ముందు జాగ్రత్త చర్యగా పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు, ఎస్ఐ నవీన్ బాబులు తెలిపారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా: సీపీఐ

రాయచోటిటౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలకు గురై ప్రాణాలు పోతున్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోరా అని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రి సుమిత్ర ధ్వజమెత్తారు. బుధవారం వారు రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డు మాసాపేటలో గల నారాయణస్వామి వీధిలో ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాసాపేట 31వ వార్డు నారాయణస్వామి వీధిలో నివాసాల మధ్య ఉన్న విద్యుత్ లైన్‌ను తొలగించమని ప్రజలు పలు దఫాలుగా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఇళ్ల మధ్యన ఉన్న విద్యుత్ వైర్ల షాక్‌తో 5 సంవత్సరాల క్రితం కమాల్‌బీ అనే మహిళ మృతి చెందిందన్నారు. ఇబ్బందికరంగా ఉన్న ఆ విద్యుత్ లైన్‌ను తొలగించాలని, లేకుంటే విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు హుస్సేన్, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు సత్వర న్యాయం



సమస్యలపై ఫిర్యాదు చేస్తున్న వినియోగదారులు

ఒంటిమిట్ట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఏపీఈఆర్‌సీ వారు నిర్దేశించిన ప్రకారం సేవలు నిర్వర్తింపక అమలులో జాప్యాన్ని పరిశీలించి సీజీఆర్ఎఫ్ వినియోగదారులకు సత్వర న్యాయం అందిస్తుందని సీజీఆర్ఎఫ్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి తెలిపారు. బుధవారం ఒంటిమిట్టలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వినియోగదారులు తమ సమస్యలను ఈ ఫోరం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. 9 మంది వినియోగదారులు పలు సమస్యలపై ఫిర్యాదులు చేశారు. రెండు నెలల్లో ఈ సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. సీజీఆర్ఎఫ్ సభ్యులు రామ్మోహన్‌రావు, అంజనికుమార్, విజయలక్ష్మీ, విద్యుత్‌శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ నాయక్, ఏఈ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం: సీపీఎం



జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), మార్చి26(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీ.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట జిల్లా కమిటీ సభ్యుడు రామాంజులు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి 22 వరకు చేపట్టిన ప్రజా చైతన్య యాత్రలోని ప్రజా సమస్యలను జేసీ ఆదర్శ్ రాజేంద్రన్‌కు వినతిపత్రం ద్వారా తెలియజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంట సోలార్ రైతులకు పంట నమోదు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. సంబేపల్లె, దుద్యాల దళితవాడ, ఇంకా 8 గ్రామాల్లో దాదాపు 250 మంది రైతులు తమ అనుభవంలోని భూములు సుండుపల్లె మండలంలో ఉన్నాయనే నెపంతో పట్టా పాసుబుక్కులు ఇవ్వలేదన్నారు. ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం తగదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో 20 దళిత గ్రామాలకు శ్మశాన వాటికలు లేవన్నారు. ఏజీ గార్డెన్, రాజులకాలనీ, రాయుడుకాలనీ, ఎగువ అబ్బవరం కాలనీల్లో సీసీ రోడ్లు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హరిశర్మ, నాగరాజు, గాయత్రి, రమేశ్‌బాబు, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నగదు అందజేస్తున్న నాయకులు

రాజంపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుడు మల్లికార్జున కుటుంబానికి భవన నిర్మాణ కార్మిక సంఘం నేత సోదరులు మన్నేసాహెబ్, హుస్సేన్, షీలార్ రూ.3.30 లక్షల సాయం అందజేశారు. అలాగే ప్రకాశం జిల్లా నుంచి పనికి తీసుకువచ్చిన మేస్త్రీ కొండయ్య రూ.ఒక లక్ష నగదును అందజేశారు. జిల్లా అధ్యక్షుడు గాలి చంద్రయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణపై అవగాహన

రైల్వేకోడూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మామిడి తోటల సస్యరక్షణపై బుధవారం మండలంలోని శెట్టిగుంట, చియ్యవరం, మారావారిపల్లె గ్రామాల్లో రైతులకు అనంతరాజుపేట కళాశాల కీటక శాస్త్ర విభాగం డాక్టర్ శారద అవగాహన కల్పించారు. రాజంపేట ఉద్యాన శాఖ అధికారి జి.సురేష్‌బాబు, రైల్వేకోడూరు ఉద్యాన అధికారి వెంకటభాస్కర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, మామిడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు: మామిడి సాగులో పూత పిందె దశలో రసం పీల్చే కీటక నివారణిని చర్యల గురించి వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అనంతరాజుపేట శాస్త్రవేత్త డాక్టర్ శారద ఆధ్వర్యంలో మండలంలోని కొండూరు, ఈటమాపురం, సిద్దవరం, రైతుసేవా కేంద్రాల పరిధిలోని రైతులకు అవగాహన కల్పించారు. రాజంపేట, రైల్వేకోడూరు ఉద్యానశాఖ అధికారులు సురేష్‌బాబు, వెంకటభాస్కర్, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

ఓబులవారిపల్లె, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై అందజేస్తున్నట్లు ఏవో బి.మల్లిక తెలిపారు. మండలంలోని చెన్నరాజుపోడులో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్లు అవసరమున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీహెచ్ఏ త్రీవేణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంసీఏ బుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణంపై ఫిర్యాదు



వినతిపత్రం అందజేసిన షామీర్

పెనగలూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ఉన్నత పాఠశాల ఎదురుగా గల ఈద్గా మైదానంలో నిర్మించే మసీదు నిర్మాణానికి వైసీపీ కార్యకర్తల నుంచి వస్తున్న అడ్డంకులను తొలగించాలని కోరుతూ బుధవారం మంగళగిరి టీడీపీ గ్రీవెన్స్ కార్యక్రమంలో అర్జీ ఇచ్చినట్లు మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ షామీర్ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందిస్తూ ముస్లిం మైనార్టీ మంత్రి ఫరూక్‌కు, అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు సమస్యను తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.

తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటాం

సిద్దవటం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు తాగునీటి ఎద్దడి ఎదురవ్వకుండా శాశ్వత పరిష్కారం దిశగా ముందుకెళతామని ఎంపీడీవో ఫణిరాజకుమారి తెలిపారు. చాముండేశ్వరిపేటలో బుధవారం స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో మాట్లాడుతూ సమస్యలు ఉంటే సచివాలయలో తెలపాలన్నారు. ఉపాధి హామీ ఏపీవో నరసింహులు, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, టెక్నికల్ అసిస్టెంట్ ఓబుల్‌రెడ్డి, నేకనాపురం సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

సిద్దవటం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం ఆయన అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కాంపౌండ్ వాల్, ప్రాథమిక పాఠశాల ఆవరణలో బండ పరిచేందుకు రూ.లక్షతో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిపన్ను వడ్డీపై 50శాతం రాయితీ

రాజంపేట టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మున్సిపాలిటి పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను ఇళ్లు, ఖాళీ స్థలంపై పన్ను పూర్తిగా చెల్లించినవారికి వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని బుధవారం అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావున ఆస్తి పన్ను చెల్లింపుదారులు సమీపంలోని మీసేవా కేంద్రం, వార్డు సచివాలయం, మున్సిపల్ కార్యాలయంలలో ఈనెల 31 లోగా చెలిస్తే వడ్డీ రాయితీ అవకాశం ఉంటుందన్నారు.

కేసు నమోదు

సిద్దవటం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూలపల్లె క్రాస్‌రోడ్డు మద్యం సేవించి ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తిపై సిద్దవటం పోలీసులు కేసు నమోదు చేశారు. కడప వైపు నుంచి బద్వేలు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న అట్లూరు మండలవాసి తోట వెంకటేశ్వర్లు వాహనానికి సంబంధించి పత్రాలు తనిఖీ చేస్తుండగా అతని మాటలు తడబడడంతో బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేయగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని పోలీసులు వివరించారు.

వైస్ ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

ఒంటిమిట్ట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండల వైస్ ఎంపీపీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో కుళ్లాయిబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 11 గంల నుంచి నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. అనంతరం నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నిక, అనంతరం ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. ఎనిమిది మంది ఎంపీటీసీలు ఉన్నారని, వారందరినీ ఆహ్వానించామన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రైల్వేకోడూరు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మవిజయ ఆస్పత్రి ఆవరణంలో బుధవారం ఏఆర్‌సీ ఫెర్టిలిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్యత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యురాలు ఆర్ఎన్ శ్వేతారెడ్డి ఉచితంగా క్యల్టేషన్, స్కానింగ్, సెమన్ అనాలసిస్, కౌన్సెలింగ్ నిర్వహించారు. పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సుమారు 500 మంది మహిళలకు ఉచితంగా పరీక్షలు చేశారు. వైద్యులు పద్మవిజయ, అతికారి రత్నం పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

సిద్దవటం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 రామక్రిష్ణ ఆసుపత్రిలో గురువారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ప్రమోద తెలిపారు. కడప వైద్యశాల మాతృశ్రీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మహిళల వ్యాధులు, సంతానం లేని దంపతులకు చికిత్సలు అందించి మందులు కూడా ఉచితంగా అందిస్తామన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

గాలివీడు, మార్చి26(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని , 18 సంవత్సరాలు నిండిన తరువాతే ఆడపిల్లలకు వివాహం చేయాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి సూచించారు. బుధవారం నూలివీడు పంచాయతీ కేంద్రంలోని సచివాలయంలో అంగన్వాడీ టీచర్లతో కిశోర వికాసం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల అనర్థాలతో పాటు రక్తహీనత, శిశు మరణాలు, మాతృమరణాలు సంభవిస్తాయన్నారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు సుజాతరెడ్డి, అరుణకుమారి, టీచర్లు, వర్కర్లు పాల్గొన్నారు.



కిశోర వికాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి

దేశాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం

● 'శాన్వి' వార్షికోత్సవంలో ఏఎస్పీలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏఎస్పీలు, చైర్మన్ శరత్‌కుమార్‌రాజు

రాజంపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాక బోయనపల్లెలో ఉన్న శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం వార్షికోత్సవాలు అంబరాన్నంటాయి. ముఖ్యఅతిథిగా రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే, చిత్తూరు ఏఎస్పీ శివానందకిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ హెగ్డే మాట్లాడుతూ దేశ అభివృద్ధికి విద్యార్థులు కీలకమన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. విద్యార్థులకు ఇలాంటి వాతావరణాన్ని కల్పించడం హర్షదాయకమని స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఏఎస్పీ శివానందకిషోర్ అకడమిక్ టాపర్స్‌కు, క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు మెడల్స్ బహుకరించారు. చైర్మన్ శరత్‌కుమార్‌రాజు, సీఈవో శంకర్‌రాజు, ఎండీ కొండూరు భరత్‌కుమార్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల, బీవీఎన్ పాఠశాల ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ జయశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.